## క్లుప్తంగా


### నేడు గంగంపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

**గోకవరం:** మండలంలోని గంగంపాలెంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### నేడు బాలల దినోత్సవం

**మధురపూడి:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కోరుకొండ మండలంలోని గ్రంథాలయాలు, విద్యాసంస్థల్లో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నిర్వహించనున్నారు. కోరుకొండ, దోసకాయలపల్లి లైబ్రరీల్లో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించనున్నట్టు లైబ్రేరియన్ వీవీ శ్రీనివాస్ తెలిపారు.

### క్విజ్, చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీలో ప్రతిభ చూపిన వైష్ణవి

**మధురపూడి:** బొబ్బిల్లంక ప్రభాకర్ నగర్ హైస్కూల్లో సోమవారం జరిగిన చిత్రలేఖనం పోటీల్లో సూరంపూడి వైష్ణవి ప్రథమ బహుమతిని గెలుచుకుంది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్ హెచ్ఎం కోలా సత్యనారాయణ క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాన్ని గీసిన తొమ్మిదో తరగతి విద్యార్థిని వైష్ణవి, క్విజ్ పోటీల్లో అరిగెల దివ్య ప్రథమ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందరరావు, రామకృష్ణ, రేష్మ పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడిగా శ్రీను


పరస శ్రీనును సత్కరిస్తున్న సభ్యులు

**మధురపూడి:** కోరుకొండ భార్గవ గాయత్రీ బ్రాహ్మణ సేవాసమాఖ్య అధ్యక్షుడిగా పరస శ్రీను సోమవారం ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా పెద్దింటి విద్యాసాగర్, మామిళ్లపల్లి దీక్షితులు, మహంతి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కపిలవాయి రామ్‌ప్రసాద్, కార్యదర్శిగా మద్దూరి కుమార్, ఇద్దరు ఉపకార్యదర్శులు, ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

### పీఎంపీ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా చిన్ని


పీఎంపీ అసోసియేషన్ జిల్లా కోశాధికారి చిన్నిని సత్కరిస్తున్న సభ్యులు

**గోకవరం:** పీఎంపీ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా కోశాధికారిగా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డికి చెందిన పి.చిన్ని నియమితులయ్యారు. ఆయన గతంలో గోకవరం, కోరుకొండ, ఏజెన్సీ మండలాల అధ్యక్షుడిగా నాలుగుసార్లు పని చేశారు. కోశాధికారిగా నియమితులైన చిన్నిని పీఎంపీ మండల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు అభినందించి శాలువా, పూలమాలతో సత్కరించారు.

### నిబంధనలు బేఖాతరు


ఐదు బాణసంచా దుకాణాలకు వినియోగించిన మీటర్

**మధురపూడి:** కోరుకొండలో ఒకే విద్యుత్ మీటర్ ద్వారా కరెంట్‌తో ఐదు బాణసంచా దుకాణాలను నిర్వహించి, వ్యాపారస్తులు విద్యుత్‌శాఖకు నష్టం తెచ్చారు. దీపావళి సందర్భంగా ఆదివారం కోరుకొండ శివారు పెట్రోలు బంకు సమీపంలో ఐదు దుకాణాల ద్వారా బాణసంచా సామగ్రిని విక్రయించారు. నిబంధనల ప్రకారం ప్రతి దుకాణానికి సెపరేట్ మీటర్ ఉండాలి. జనరేటర్, ఇసుక, నీరు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలి. కానీ వీటిని వ్యాపారులు పట్టించుకోలేదు. అలాగే బాణసంచా ధరలు బాగా పెరిగిపోవడంతో కొనుగోలు చేయడానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు.

### జనసేన సమావేశం

**రాజానగరం:** స్థానిక రాయల్ కల్యాణ మండపంలో జనసేన టీమ్ శతఘ్ని సమావేశం సోమవారం రాత్రి జరిగింది. ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# కార్తికం.. ఆధ్యాత్మిక శోభితం

- నేటి నుంచి కార్తిక మాసోత్సవాలు
- శైవ క్షేత్రాల్లో పూజలకు ఏర్పాట్లు పూర్తి


అనపర్తి శివాలయంలో కొలువుదీరిన ఉమా రామలింగేశ్వరస్వామి


అనపర్తిలో ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయం

**అనపర్తి:** కార్తిక మాసం.. శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైంది. ఈ నెల రోజులూ పుణ్యస్నానాలు ఆచరించడంతో పాటు ప్రత్యేక పూజలు, దానాలు, ఉపవాస వ్రతాలు, దీపారాధనలు చేయడం ద్వారా విశేష ఫలితం ఉంటుందని భక్తుల విశ్వాసం. సాధారణ రోజుల్లో ప్రత్యేక పూజలు ఆచరించినా కార్తిక మాసంలో నిర్వహించే పూజాదికాలతో ప్రత్యేక ఆధ్యాత్మిక భావన కలుగుతుంది. ఈ మాసంలో పుణ్య క్షేత్రాలను సందర్శించి, పూజాదికాలు చేస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అందుకే మిగిలిన పర్వదినాల కంటే కార్తికంలో పరమశివుడిని ఆరాధించేందుకు భక్తులు ఇష్టపడుతుంటారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న కార్తిక మాసోత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. శివయ్య దర్శనానికి శైవ క్షేత్రాలకు వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనపర్తి మండలం దుప్పలపూడిలోని పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి, పెడపర్తిలోని పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వర స్వామి, రామవరంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, పొలమూరు, అనపర్తి పాతవూరిలోని ఉమా రామలింగేశ్వరస్వామి, మార్కండేయపురంలోని భావనాఋషి ఆలయం, మహేంద్రవాడ బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి, కుతుకులూరు కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయాలతో పాటు మండలంలోని పులుగుర్త, పెడపర్తి, మహేంద్రవాడ, కొప్పవరం, పీరారామచంద్రపురం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**పుణ్య స్నానాలకు ప్రాధాన్యం**

కార్తికమాసంలో కేవలం ఆధ్యాత్మికపరమైన అంశాలే కాకుండా ఎన్నో ఆరోగ్య రహస్యాలు ఇమిడి ఉన్నాయని పెద్దలు చెబుతారు. ఈ మాసంలో ఉదయమే చన్నీటి స్నానాలు ఆచరించడం వల్ల శారీరక రుగ్మతలు తొలగడంతో పాటు కార్తికంలో పగలు ఉపవాసం ఉండడం వల్ల జఠరాగ్ని సమస్యలను నివారించుకోవచ్చు. అంతేకాకుండా కార్తిక స్నానాలు ఆచరించడం ద్వారా అన్నిరకాల దోషాలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. దీంతో వేకువజామునే నదులు, కాలువల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి శైవక్షేత్రాలకు వెళ్లి ముక్కంటిని దర్శిస్తారు.

**దీపారాధన విశిష్టం**

ఈ మాసంలో దీపరాధన, దీపదర్శనం పుణ్యదాయకం. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు సూర్యోదయానికి ముందే ఇళ్లలో తులసి చెట్టు వద్ద, ఆలయాల్లో నందీశ్వరుని వద్ద ఆవు నెయ్యితో దీపారాధన చేయడం వల్ల కష్టాలు తొలగి, ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని విశ్వసిస్తారు. అదేవిధంగా దీపారాధన చేసి ఆకాశ దీపాన్ని దర్శించి ఉసిరి చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేయడంతో పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

**బిక్కవోలు:** మండలంలో దీపావళి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. కుటుంబ సమేతంగా బాణసంచా కాల్చి సందడి చేశారు. సోమవారం ఉదయం కూడా అమావాస్య ఉండడంతో మంగళవారం నుంచి కార్తికమాస పూజలకు అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

# పేద వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పాలన

- మునికూడలి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా దిద్దుతా
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


మునికూడలిలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

**మధురపూడి:** పేద వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, సంక్షేమం – అభివృద్ధి రెండుకళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం ఆయన సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి రూ.6.50 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. సంక్షేమ పథకాలను పగడ్బందీగా అమలు జరుపుతున్న ఏకైక ప్రభుత్వమిదే అన్నారు. సంక్షేమ పథకాలుగా గ్రామంలో 4,377 మందికి రూ.11,48,02,057 అందించినట్టు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కేవలం రూ.57 లక్షలు మాత్రమే కేటాయించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నిందారోపణలు చేస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పేదలు, సన్న, చిన్నకారు రైతుల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలందించాలన్న దృక్పథంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీతానగరం ఎంపీపీ గుర్రాల జోత్స్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి హరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబు, మునికూడలి ఎంపీటీసీ సభ్యురాలు నూతంగి ధనలక్ష్మి, నాయకులు కవల దుర్గం, అంబటి రాజు, కవల విష్ణుమూర్తి, నూతంగి నాగన్నదొర, కొల్లి చిరంజీవి, ఏకా రాజు పాల్గొన్నారు.

# మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం


పెదపూడి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

- పార్టీ శ్రేణులు కలసికట్టుగా సాగాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

**పెదపూడి:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయమని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తిరిగి జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను సమ్మంగి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కాకార సాయిబాబు, కోరా బాబి, పప్పు సింహాచలం, మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో దీపాలంకరణ


రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆకట్టుకున్న దీపాలు

**రాజానగరం:** దీపావళి సందర్భంగా రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో దీపాలంకరణ ఎంతో ఆకట్టుకుంది. ప్రతి పండగకు తనలోని సృజనాత్మకత భావాలను జోడించి, అందమైన అలంకరణకు ప్రాధాన్యతనిచ్చే స్థానిక రైతు నీల పాల సుబ్రహ్మణ్యం ఈ దీపావళికి కూడా ఆకట్టుకునే రీతిలో అలంకరణ చేశారు. తన పొలం నుంచి తీసుకువచ్చిన అరటి బొందలకు, ప్లాస్టిక్ గ్లాసులను అమర్చి, వాటిని రకరకాల రంగులు కలిపిన రంపపు పొట్టుతో నింపారు. ఆపై ప్రమిదలను పెట్టి దీపాలను వెలిగించడంతో ఆలయంలో అబ్బురపరిచేలా దీపాల కాంతులు విరబూశాయి. భక్తులు తమ వెంట తీసుకువచ్చిన బాణాసంచాను ఆలయం ప్రాంగణంలో కాలుస్తూ పిల్లాపాపలతో సరదాగా గడిపారు. నియోజకవర్గంలో ప్రజలందరూ దీపావళి పండగను ఆదివారం సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు.

**నేటి నుంచి ఆకాశ దీపాల ఏర్పాటు**

సాధారణంగా దీపావళి మరుసటి రోజు నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతుంది. అయితే ఈసారి తగులు, మిగులు వ్యత్యాసాలతో రెండోరోజు నుంచి కార్తికం ప్రారంభమయ్యే నేపథ్యంలో ఆలయాల వద్ద మంగళవారం సాయంత్రం ఆకాశ దీపాలను వెలిగించనున్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ధ్వజ స్తంభాలకు వాటిని కట్టి, నెల రోజులు ఆకాశ దీపాలను వెలిగిస్తుంటారు.

# జగనన్న ప్రభుత్వంలో మహిళల సంక్షేమం

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- ఇనుగంటివారి పేటలో డ్వాక్రా మహిళల గ్రీవెన్స్


సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

**మధురపూడి:** జగనన్న ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, ముఖ్యంగా డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. సీతానగరం మండలం ఇనుగంటివారి పేటలో సోమవారం నిర్వహించిన డ్వాక్రా గ్రీవెన్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిలో కొన్నింటిని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం చేశారు. మిగిలినవి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇనుగంటివారిపేట సర్పంచ్ రామ్ పండు, వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం ఈదూరి మహాలక్ష్మి, సీసీ పేరినాయుడు, సమాఖ్య అధ్యక్షురాలు కస్తూరి, వైస్ ఎంపీపీ మదన్ మోహన్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుజీరావు పాల్గొన్నారు.

# టీడీపీ హయాంలో కానరాని అభివృద్ధి

- పుష్కరాల నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి
- ఎంపీ భరత్‌రామ్ ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

**రాజమహేంద్రవరం సిటీ:** నగరపాలక సంస్థలో మేయర్లు, కార్పొరేటర్లుగా 15 ఏళ్ల పాటు తెలుగుదేశం పార్టీ నాయకులే ఉన్నారని, కానీ వారు చేసిన అభివృద్ధి నగరంలో ఎక్కడా కనిపించడం లేదని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పుష్కరాలకు మంజూరైన రూ.రెండువేల కోట్లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం తాము నగరంలో చేసిన అభివృద్ధిని, అందుకు వెచ్చించిన నిధుల గణాంకాలను పైసలతో సహా చూపిస్తున్నామని, అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పారదర్శకత అన్నారు. పుష్కరాల పేరుతో ప్రత్యేక నిధులుగా మంజూరైన రూ.2 వేల కోట్లు పంచుకున్నారే తప్పిస్తే, నగరంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు.

**అభివృద్ధిని ప్రజలే చూస్తున్నారు**

వైఎస్సార్ సీపీ పాలనలో నగరంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రత్యక్షంగా ప్రజలే చూస్తున్నారన్నారు. నగరం నుంచి ప్రతి రోజూ 80 నుంచి 85 ఎంఎల్డీ మురుగునీరు తయారవుతోందని, పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదన్నారు. నల్లా ఛానల్ వద్దనున్న నీటి శుద్ధి కేంద్రాన్ని కాతేరుకు పంపాల్సి ఉందని, దానికోసం రూ.150 కోట్లు వ్యయం అవుతాయని ఒక అంచానాను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు రూపొందించారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నమామి గోదావరి ప్రాజెక్టులో భాగంగా రూ.430 కోట్ల పాజెక్టుకు నివేదిక అందజేసి కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. మొదటి విడతగా రూ.88 కోట్లు మంజూరు చేశారన్నారు. ఎన్జీటీ గైడ్ లైన్స్ ప్రకారం గోదావరిలో మురుగు, వ్యర్థం నీటిని శుద్ధి చేసి వదలాలని, దీనికోసం ఫస్ట్ ఫేజ్‌లో ఆ ప్రక్రియపై దృష్టి సారించామన్నారు. నాలుగున్నరేళ్లలో రూ.330 కోట్లతో రాజమహేంద్రవరాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామన్నారు.

# కరపత్రం ఆవిష్కరణ

**అనపర్తి:** శ్రీరామకృష్ణ సేవా సమితి, జీబీఆర్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో వచ్చే నెల 3న స్వామి వివేకానంద టాలెంట్ టెస్ట్–2023 నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించి తొలి ప్రతిని సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డికి అందజేశారు. రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి, రాయవరం, రాజానగరం, మండపేట అర్బన్, రూరల్ మండలాల పరిధిలో 60 పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ 3న ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. విజేతలకు స్వామి వివేకానంద ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. జీబీఆర్ పాలకమండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందరరామారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, కార్యదర్శులు నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, తాడి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

**ప్రకాశం నగర్:** మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఆ సామాజిక వర్గ నాయకులు అన్నారు. స్థానిక చర్చిపేట, సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో దొండపాటి సుధాకర్, దొండపాటి క్రిస్టోఫర్, వెండ్రపాటి వీర్రాజు ఆధ్వర్యంలో సోమవారం మాదిగల ఆత్మీయ కలయిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ప్రభుత్వ న్యాయవాది యార్లగడ్డ అశోక్ కుమార్, మాజీ కార్పొరేటర్లు బొట్ల సూర్యారావు, ఈతకోట బాపన సుధారాణి, కోరిమిల్లి విజయ శేఖర్, దారా ఏసురత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూపం మహాసభకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ఎస్సీ వర్గీకరణను పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 10న జరిగే మాదిగల వనసమారాధనకు సంఘీయులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు వైరాల అప్పారావు, తుత్తరపూడి రమణ, ఈతలపాటి కృష్ణ, చింతాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



**రాజమహేంద్రవరం సిటీ:** గోదావరి రైల్వే స్టేషన్‌లో సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై లోవరాజు తెలిపారు. అతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఒంటిపై గళ్ల చొక్కా, పంచె ఉన్నాయన్నారు. మృతదేహాన్ని పోర్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లోవరాజు తెలిపారు. వివరాలకు రాజమహేంద్రవరం జీఆర్పీ రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

### వినికిడి యంత్రం పంపిణీ


బాబ్జీకి వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న చింతా గోపాలకృష్ణారెడ్డి

**అనపర్తి:** వినికిడి సమస్యతో బాధపడుతున్న ఓ దివ్యాంగుడికి అనపర్తికి చెందిన శ్రీచక్ర ఆయిల్స్ అధినేత చింతా గోపాలకృష్ణారెడ్డి సహకారంతో వినికిడి యంత్రాన్ని అందజేశారు. రాజానగరం మండలం ముక్కినాడ పాకలకు చెందిన కె.బాబ్జీ 15 ఏళ్లుగా వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దాత గోపాలకృష్ణారెడ్డి అధునాతన వినికిడి యంత్రాన్ని కొనుగోలు చేసి సోమవారం బాబ్జికి అందజేశారు. కార్యక్రమంలో రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ వ్యవస్థాపకుడు నల్లమిల్లి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక చింతనతో సుఖమయ జీవితం

**రంగంపేట:** ఆధ్యాత్మిక చింతనతోనే సుఖమయ జీవితం సాకారమవుతుందని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సత్యసాయి సేవా మందిరంలో సోమవారం నిర్వహించిన సత్యసాయి అఖండ భజనలో ఆయన పాల్గొని మాట్లాడారు. సత్యసాయి అఖండ భజనలు జిల్లాలో 15 చోట్ల జరిగాయని తెలిపారు. 24 గంటల పాటు ఏకధాటిగా ఈ అఖండ భజన జరుగుతుందన్నారు. మండలంలో కోటపాడు, ఈలకొలను, రంగంపేట, ముకుందవరం గ్రామాల్లో జరిగిన భజనలను సందర్శించినట్టు తెలిపారు. ముందుగా బాబా చిత్రపటానికి, పాదుకలకు ప్రత్యేక పూజలు చేశామన్నారు. ప్రశాంతి సేవల జిల్లా ఇన్‌చార్జి తిక్కిశెట్టి గోవిందరాజులు, జిల్లా విద్యా విభాగం సమన్వయకర్త ఎల్.శ్రీనివాస రాజు, రాజమహేంద్రవరం జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


కొంకుదురులో గ్రంథాలయం వద్ద వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్ వీరమణి

**బిక్కవోలు:** కొంకుదురు శాఖా గ్రంథాలయం వద్ద 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను సర్పంచ్ సత్తి వీరమణి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య పుట్టిన గ్రామం ఇదే కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 20 వరకూ వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించడం, 17న కవి సమ్మేళనం, 18న చిత్ర లేఖనం, రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు, 19న దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, విద్యార్థులకు బహుమతులు, ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. కొంకుదురు ఎంపీటీసీ సభ్యుడు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, శాఖా గ్రంథాలయ అధికారి నందికోళ్ల బాల తదితరులు పాల్గొన్నారు.

### గడ్డి ట్రాక్టర్ దగ్ధం


బలభద్రపురంలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**బిక్కవోలు:** బలభద్రపురం గ్రామంలో సోమవారం గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. అనపర్తి అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. బలభద్రపురానికి చెందిన గొలుగూరి బాపిరెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో గడ్డిని తీసుకు వస్తుండగా విద్యుత్తు తీగలు తగలడంతో ట్రాక్టర్‌కు నిప్పంటుకుంది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. చివరికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. సుమారు రూ.50 వేల నష్టం జరిగినట్లు అంచనా.